సాక్షి
కామారెడ్డి
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



స్థల వివాదంలో..
దేమికలాన్‌లో రెండిళ్ల మధ్యలోనున్న స్థలం విషయంలో చెలరేగిన వివాదం ఒకరిని బలి తీసుకుంది.
- 8లో ▸



శిలాఫలకానికే పరిమితం
గాలిపూర్‌– కోమలంచ మార్గంలో హైలెవల్‌ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం మొదలవడం లేదు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /11.7

వాతావరణం
ఉదయం చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్‌

కొనసాగుతున్న ఇంటర్‌ ప్రాక్టికల్స్‌



కామారెడ్డి టౌన్‌: జిల్లాలో ఇంటర్మీడియట్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం జరిగిన పరీక్షకు 581 మందికిగాను 570 మంది హాజరయ్యారు. వొకేషనల్‌ విభాగంలో 160 మందికిగాను 154 ప్రాక్టికల్స్‌ పరీక్షలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 362 విద్యార్థులకుగాను 333 మంది, వొకేషనల్‌ విభాగంలో 240 కిగాను 227 హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్‌ నోడల్‌ అధికారి షేక్‌ సలాం తనిఖీ చేశారు.

బెంగళూరు ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బెంగళూరుకు వెళ్లే ఆర్టీసీ ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు సంస్థ రీజినల్‌ మేనేజర్‌ టి.జోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ స్లీపర్‌, ఏసీ సీటర్‌, రాజధాని బస్సులకు ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడం, సౌకర్యవంతం చేయడం లక్ష్యంగా ఈ ఆఫర్‌ ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ముందస్తు రిజర్వేషన్‌ల కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లోగాని, సమీప బస్సు రిజర్వేషన్‌ కౌంటర్‌లలోగాని సంప్రదించాలని సూచించారు.

గురుకులంలో సబ్‌ కలెక్టర్‌ బస



బాన్సువాడ రూరల్‌: బోర్లం క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం రాత్రి సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాత్రి అక్కడే బస చేశారు.

క్రషింగ్‌ గడువు పొడిగింపు

నిజాంసాగర్‌: మాగిలోని గాయత్రి కర్మాగారంలో చెరుకు క్రషింగ్‌ గడువును ఈనెల 20 వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కర్మాగారం కేన్‌ మేనేజర్‌ వెంగళ్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం కర్మాగారంలో 4 లక్షల మెట్రిక్‌ టన్నుల చెరుకు గానుగ ఆడించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3.53 లక్షల మెట్రిక్‌ టన్నుల చెరుకు క్రషింగ్‌ జరిగిందన్నారు. క్రషింగ్‌ గడువు 15 వరకు ఉండగా వారం రోజుల పాటు పొడిగించామన్నారు.

పొదుపుగా వాడుకోవాలి

సుభాష్‌నగర్‌: ఇంధనాన్ని పొదుపుగా వాడుకొని భవిష్యత్‌ తరాలకు అందించాలని హిందుస్థాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (హెచ్‌పీసీఎల్‌) ఆర్‌ఎం శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని న్యూ కలెక్టరేట్‌ రోడ్డులో ఆదివారం హెచ్‌పీసీఎల్‌ ఆధ్వర్యంలో ‘సాక్షం–2025’ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఇంధన పొదుపులో భాగంగా ప్రత్యామ్నాయ వనరులైన సీఎన్‌జీ, ఎలక్ట్రికల్‌ వాహనాల వైపు మొగ్గు చూపాలన్నారు.

శిశువుల మృత్యుఘోష

గతనెల 8న పాల్వంచ మండల కేంద్రానికి చెందిన భవానీకి ఇంటి వద్ద పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. డ్యూటీలో గైనకాలజిస్ట్‌ లేకపోవడంతో ఇతర విభాగం వైద్యులు పర్యవేక్షించారు. ప్రసవం చేయడానికి ఆలస్యం కావడంతో గర్భంలోనే శిశువు చనిపోయింది. మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో సిజేరియన్‌ చేసి మృత శిశువును కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కామారెడ్డి పట్టణానికి చెందిన ధనలక్ష్మి గతేడాది మార్చి 19న మధ్యాహ్నం పురిటి నొప్పులతో జిల్లా ఆస్పత్రికి వచ్చింది. సాధారణ కాన్పు కోసం రాత్రి వరకు ప్రయత్నించారు. ఆ రోజు రాత్రి డ్యూటీలో గైనకాలజిస్ట్‌ లేకపోవడంతో మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ఆపరేషన్‌ చేశారు. అప్పటికే ఉమ్మనీరు మింగి శిశువు మృతి చెందింది.

గతేడాది నవంబర్‌ 16న రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన రాధ రెండో కాన్పుకోసం జీజీహెచ్‌కు వచ్చింది. గైనకాలజిస్ట్‌ అందుబాటులో లేకపోవడంతో సకాలంలో డెలివరీ జరగలేదు. దీంతో శిశువు గర్భంలోనే చనిపోయింది. ఆపరేషన్‌ చేసి మృత శిశువును బంధువులకు అప్పగించారు. అదే నెలలో మరో ఇద్దరు శిశువులు కూడా పురిటిలోనే మృతి చెందారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో సకాలంలో డెలివరీలు జరగక ఏటా పదుల సంఖ్యలో శిశుమరణాలు సంభవిస్తూనే ఉన్నాయి.



సేవలందక.. ప్రాణం నిలవక..

- జిల్లా ఆస్పత్రిని వేధిస్తున్న వైద్యుల కొరత
- సకాలంలో డెలివరీకాక గర్భంలోనే మృత్యువాత
- ప్రతినెలా రెండుమూడు ఘటనలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ హాస్పిటల్‌

కామారెడ్డి టౌన్‌: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)లో చాలా వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా గైనకాలజిస్ట్‌ పోస్టులు ఖాళీగా ఉండడంతో గర్భిణులకు సరైన సేవలు అందడం లేదు. సమయానికి ప్రసవాలు జరక్కపోవడంతో గర్భంలోనే శిశువులు మృతిచెందుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులూ చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాలో శిశు మరణాలు ఆగడం లేదు.

జీజీహెచ్‌లో గైనిక్‌ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్‌ ప్రొఫెసర్లు, ముగ్గురు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక ప్రొఫెసర్‌, ఒక అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ఒక అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ మాత్రమే ఉన్నారు. మిగతా ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ముగ్గురూ మెడికల్‌ కళాశాలలో విద్యార్థులకు టీచింగ్‌తో పాటు, జీజీహెచ్‌లో మహిళలకు, గర్భిణులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. పోస్టులు ఖాళీగా ఉండడంతో జీజీహెచ్‌లో 24/7 గంటల పాటు సేవలందించలేకపోతున్నారు. అర్ధరాత్రి వేళలో,

సమయానికి వైద్యం అందక..

జీజీహెచ్‌లో వాస్తవానికి డ్యూటీ షెడ్యూల్‌ ప్రకారం 24 గంటల పాటు ఒక్కరైనా గైనకాలజిస్ట్‌ అందుబాటులో ఉండాలి. అయితే వైద్యుల కొరతతో వారంలో రెండు, మూడు రోజుల్లో మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చేవారికి సరైన సేవలు అందడం లేదు. ప్రధానంగా ప్రసవం కోసం వచ్చే గర్భిణులు ఇబ్బందిపడుతున్నారు. వైద్యులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో సీజేరియన్‌లు చేయకపోవడంతో ఉమ్మనీరు మింగి, గర్భంలో నీరంతా పోయి, శ్వాస ఆడక, ఇతర కారణాలతో గర్భంలోనే శిశువులు మృత్యువాత పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో ప్రతినెలా మూడుకుపైనే శిశుమరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, వైద్యుల పోస్టులను భర్తీ చేసి, వైద్య సేవలు మెరుగుపడేలా చూడాలని, శిశుమరణాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

గైనకాలజిస్ట్‌లు లేక ఇబ్బందులు

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో గైనకాలజిస్ట్‌లు లేరు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖాళీలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరారు. కొరత ఉన్నా సేవలకు ఇబ్బంది కలగకుండా వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఎమర్జెన్సీ ఉంటే రిఫర్‌ చేస్తున్నాం.

– ఫరీదా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌, జీజీహెచ్‌, కామారెడ్డి

సెలవు రోజుల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. డ్యూటీలో ఉన్న ఇతర విభాగాల వైద్యులు ప్రసవాలు, ఆపరేషన్‌ చేయలేక నిజామాబాద్‌, హైదరాబాద్‌లకు రిఫర్‌ చేస్తున్నారు.

చలానా సొమ్ము తిరిగిచ్చేదెప్పుడో?



దోమకొండలోని సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం

- రిజిస్ట్రేషన్‌ రద్దయితే చలానాలు తిరిగి చెల్లించని సర్కారు
- ఐదేళ్లుగా పెండింగ్‌లోనే..
- ఉమ్మడి జిల్లాలో రూ. 15 కోట్లకుపైనే బకాయిలు

దోమకొండ: ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం చలానాల రూపంలో డబ్బులు వసూలు చేస్తుంది. అయితే అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్‌ రద్దయితే దరఖాస్తుదారుకు చలానాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయితే సుమారు ఐదేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందిపడుతున్నారు.

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో పది సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలున్నాయి. నిజామాబాద్‌ అర్బన్‌, రూరల్‌తో పాటు బోధన్‌, ఆర్మూర్‌, భీంగల్‌, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, దోమకొండలలో సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్‌ రద్దయినవారికి ఐదేళ్లుగా చలానాలు వాపస్‌ రావడం లేదు.

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో సుమారు 600 మందికి సంబంధించి రూ. 15 కోట్ల రూపాయల రావాల్సి ఉందని తెలుస్తోంది. చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్‌ చేసుకోనివారు తమ డబ్బుల కోసం దరఖాస్తు చేసుకుంటే వారి వివరాలను తీసుకుని బిల్లులు చేసి కోశాగార కార్యాలయానికి పంపిస్తున్నామని రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా ఇటీవల కోశాగార కార్యాలయానికి పంపిన బిల్లులు తిరస్కరణకు గురైనట్లు తెలిసింది. మళ్లీ బిల్లులు చేయడానికి ఉన్నతాధికారుల అనుమతికోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డబ్బులు విడుదల చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

దోమకొండలో 50 పడకల ఆస్పత్రి!

- రూ. 22 కోట్లతో ప్రతిపాదనలు

కామారెడ్డి టౌన్‌: దోమకొండలో 50 పడకలతో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మించేందుకు తెలంగాణ మెడికల్‌ సర్వీసెస్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌(టీజీఎంఎస్‌ఐడీసీ) రూ. 22 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నిధులు, అనుమతి కోసం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌కు, ప్రభుత్వానికి నివేదించింది. ఆస్పతి భవన నిర్మాణం కోసం ముత్యంపేట రోడ్‌లోని సర్వే నంబర్‌ 1796, 1797లలో 4.03 ఎకరాల స్థలాన్ని గతంలోనే కేటాయించిన విషయం తెలిసిందే. ఈ స్థలంలో సివిల్‌ వర్క్స్‌, అస్పత్రి భవనం, మార్చురీ గది నిర్మాణం కోసం రూ. 11.22 కోట్లు, కాంపౌండ్‌ వాల్‌కోసం రూ. 10 లక్షలు, సీసీ రోడ్డుకోసం రూ. 7 లక్షలు, మెడికల్‌ గ్యాస్‌ పైప్‌లైన్‌ కోసం రూ. 25 లక్షలు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. ఫైర్‌ ఫిటింగ్‌ సిస్టంకోసం రూ. 20 లక్షలు, నీటి సరఫరా, సానిటరీ ఏర్పాట్లకు రూ. 1.14 కోట్లు, విద్యుత్‌ సరఫరా, ఇతర ఏర్పాట్లకు రూ. 1.71 కోట్లు, మెడికల్‌ పరికరాలకు రూ. 1.25 కోట్లు, ఇంజినీరింగ్‌, ఇతర అభివృద్ధి పనులకు రూ. 6 కోట్ల వరకు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనుల చేపట్టనున్నారు.



గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



గేటు ముందు బైఠాయించిన తల్లిదండ్రులు

బాన్సువాడ రూరల్‌: బోర్లంక్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఎదుట ఆదివారం పలువురు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఇటీవల పాఠశాల నుంచి ఓ విద్యార్థినిని వరుసకు అన్న అయ్యే యువకుడు బలవంతంగా తీసుకెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థినుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోతామని హెచ్చరించారు. ప్రిన్సిపల్‌ రమాదేవి తల్లిదండ్రులను సముదాయించారు. పిల్లల చదువు, ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీ పడబోమన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పొరపాటుకు తమను నిందించడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని, తల్లిదండ్రులు సహకరించాలని కోరగా వారు శాంతించి ఆందోళన విరమించారు.

‘పిగ్‌మి’ పేరుతో కుచ్చుటోపి

- రూ. 60 లక్షలతో వ్యక్తి పరారు
- ఆందోళనలో బాధితులు

బిచ్కుంద: బ్యాంక్‌ ఉద్యోగినని నమ్మించి, పిగ్‌మీ పేరుతో డిపాజిట్లు సేకరించి అమాయకులకు కుచ్చుటోపీ పెట్టాడో మోసగాడు.. పలువురిని ముంచి, రూ. 60 లక్షలతో ఉడాయించాడు. వివరాలిలా ఉన్నాయి. బిచ్కుందకు చెందిన జంగం రాజు కెనరా బ్యాంక్‌లో ఉంటూ ఖాతాదారులకు దరఖాస్తులు, ఓచర్లు నింపడం, డీడీలు తీయడంలో సహకరించేవాడు. తనను బ్యాంకు సిబ్బందిగా పరిచయం చేసుకుంటూ మహిళలు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులను టార్గెట్‌ చేసుకుని బ్యాంక్‌ పిగ్‌మీ డిపాజిట్‌ స్కీం గురించి వివరించేవాడు. రోజూ కొంత మొత్తాన్ని జమ చేస్తే ఆకర్షణీయమైన వడ్డీ వస్తుందని నమ్మించాడు. అతడిని నమ్మిన వందలాది మంది డబ్బులు డిపాజిట్‌ చేశారు. డిపాజిట్‌ చేసినవారికి అప్పుడప్పుడు వడ్డీ ఇచ్చేవాడు. కొందరికి చెక్కులు రాసి ఇచ్చాడు. నాలుగేళ్లనుంచి డిపాజిట్లు సేకరిస్తూ వస్తున్న రాజు.. సుమారు రూ. 60 లక్షలతో వారం క్రితం కుటుంబంతో సహా పరారయ్యాడు. రాజు కనిపించకపోవడంతో అనుమానించిన డిపాజిట్‌దారులు.. బ్యాంకు అధికారులను ప్రశ్నించగా అతడు తమ సిబ్బంది కాదని తెలిపారు. అతడితో తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో ఖాతాదారులు అవాక్కయ్యారు.



బాధితులకు రాజు ఇచ్చిన చెల్లని చెక్కు

తండ్రి ఏజెంట్‌ కావడంతో..

చిరు వ్యాపారులు ఆదాయంలో కొంత నగదును ప్రతిరోజు తమ బ్యాంక్‌ ఖతాలో జమ చేసుకోవడానికి కెనరా బ్యాంక్‌(సిండికెట్‌ బ్యాంక్‌) అవకాశం కల్పించింది. వీటిని పిగ్‌మీ డిపాజిట్లుగా పేర్కొంటారు. రాజు తండ్రి బస్వంత్‌ గతంలో బ్యాంక్‌ ఏజెంట్‌గా పనిచేశాడు. ఆయన పిగ్‌మీ డిపాజిట్లను వసూలు చేసి బ్యాంకులో జమ చేసేవాడు. దీంతో రాజు కూడా బ్యాంకు సిబ్బంది అని ఖాతాదారులు నమ్మారు. వారి నమ్మకాన్ని రాజు సొమ్ము చేసుకుని డిపాజిట్లతో ఉడాయించాడు.

చెక్కు ఇచ్చి నమ్మించాడు



బ్యాంకు సిబ్బందిగా జంగం రాజు మమ్మల్ని నమ్మించాడు. డిపాజిట్‌ పేరుతో నా వద్ద రూ. 70 వేలు తీసుకున్నాడు. దానికి చెక్కు రాసి ఇచ్చాడు. బ్యాంక్‌కు వెళ్లి అడగ్గా.. ఖాతాలో డబ్బులు లేవని, చెక్కు చెల్లదని చెప్పారు. మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– నజీర్‌, బాధితుడు, బిచ్కుంద

బ్యాంకులోనే ఉండేవాడు



నేను ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌ నిర్వహిస్తాను. రాజు ఎప్పుడూ బ్యాంకులోనే ఉండేవాడు. దీంతో అతడిని బ్యాంకు సిబ్బందిగా నమ్మి మూడేళ్లుగా రోజూ కొంత నగదును జమ చేస్తూ వస్తున్నాను. చాలామంది వద్దనుంచి వసూలు చేశాడు. నాకు రూ. 90 వేలు రావాలి.

– భీం, బాధితుడు, బిచ్కుంద

బ్యాంకుకు సంబంధం లేదు



రాజు అనే వ్యక్తి బ్యాంకు పేరుతో డిపాజిట్లు సేకరించాడని కొందరు బ్యాంకుకు వచ్చారు. అతడితో బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేదు. గతంలో రాజు నాన్న బస్వంత్‌ మాత్రం మా ఏజెంట్‌గా పనిచేశాడు.

– దుర్గా భీంరావు, కెనరా బ్యాంక్‌ మేనేజర్‌, బిచ్కుంద

సంరక్షణ చర్యలేవి?

- గతనెలలో మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో అగ్నిప్రమాదం
- పాక్షికంగా కాలిపోయిన చెట్లు.. నీరందక ఎండుతున్న వైనం

నాగిరెడ్డిపేట: అగ్నిప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న చెట్లను సంరక్షించడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో చెట్లు పూర్తిగా ఎండుముఖం పడుతున్నాయి. మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో గతనెల 20న అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఉద్యానక్షేత్రం బయటవైపు గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన నిప్పు గాలికి వ్యాపించి క్షేత్రంలోకి ప్రవేశించింది. క్షేత్రంలో గడ్డి దట్టంగా పెరగడం వల్ల ఉద్యానక్షేత్రాన్ని మంటలు చుట్టుముట్టాయి. దీంతో ఉద్యాన క్షేత్రంలోని ఆయిల్‌పాం చెట్లు పూర్తిగా దగ్ధమవ్వగా 35 మామిడి చెట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి ఉద్యాన క్షేత్రాన్ని పరిశీలించి, పాక్షికంగా కాలిపోయిన చెట్లను సంరక్షించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాదం జరిగి నెల కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా క్షేత్రంలోని మామిడి చెట్లు ఎండుముఖం పడుతున్నాయి.



ఉద్యాన క్షేత్రంలో ఎండుతున్న మామిడి చెట్లు (ఇన్‌సెట్‌లో) అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చెట్లు

బోరుమోటారుకు మరమ్మతులు చేయిస్తాం

గత నెలలో ఉద్యాన క్షేత్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కొన్ని మామిడి చెట్లు దెబ్బతిన్నాయి. వాటికి నీరందించి సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ క్షేత్రంలో బోరు మోటారు చెడిపోయింది. దానికి మరమ్మతులు చేయించి చెట్లను సంరక్షిస్తాం.

– కమలాకర్‌రెడ్డి, హార్టికల్చర్‌ అధికారి, మాల్తుమ్మెద

సాంకేతిక లోపంతో టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్‌ జామ్‌

భిక్కనూరు: మండల కేంద్ర సమీపంలోని టోల్‌ ప్లాజా వద్ద సాంకేతిక లోపం ఏర్పడడంతో ఆదివారం సుమారు అరగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ జామ్‌ అయ్యింది. మూడు రోజుల క్రితం టోల్‌ ప్లాజాకు కొత్త కాంట్రాక్టర్‌ వచ్చారు. సాఫ్ట్‌వేర్‌ అప్‌డేట్‌ చేసినప్పటికీ మొరాయించడంతో పలుమార్లు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ట్రాఫిక్‌ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కామారెడ్డి వైపు వెళ్తున్న అంబులెన్స్‌ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ క్లియర్‌ చేసి పంపించారు.



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్‌

క్లుప్తంగా

కులగణనలో వివరాలు నమోదు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్: ఇటీవల చేపట్టిన కులగణనలో వివరాలు నమోదు చేయించుకోలేని వారు ఈనెల 16 నుంచి 28 వరకు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, నస్రుల్లాబాద్ ఎంపీడీవో సూర్యకాంత్‌లు వేర్వేరు ప్రకటల్లో తెలిపారు. ప్రజాపాలన కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. గతంలో వివరాలు అందించని వారు మాత్రమే దరాఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రారంభమైన రెండో విడత కులగణన



లింగంపేటలో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కులగణన రెండో విడత సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. గత సర్వేలో పాల్గొనని వారి కోసం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లోకి వచ్చే ఎన్యూమరేటర్లకు తమ కుటుంబ వివరాలు తెలియజేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం ఏఎస్సై ప్రకాశ్ నాయక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. 20 మందికి జరిమానాలు విధించారు. వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే ప్రతీ ఒక్కరూ వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో మూడో స్పెల్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.ఆదివారం పలు ప్రయోగ పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తనిఖీ చేశారు.ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్యాశాఖ అధికారి, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పరిశీలించి సమీక్షించారు.

మట్టి గొబ్బలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లు



కల్లు తీయడానికి మట్టి గొబ్బలకు బదులు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

సిరికొండ: తాటి చెట్ల నుంచి కల్లును తీయడానికి గౌడన్నలు చెట్లకు మట్టి గొబ్బలను కడుతుంటారు. సిరికొండలోని తాటి వనంలో ఓ చెట్టుకు మట్టి గొబ్బలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లను కట్టారు. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది. మొదటి సారిగా తాటి చెట్లకు కల్లుగీసే ప్రాంతంలో మట్టిగొబ్బలు సరిగా ఉండడం లేదని బాటిళ్లను ఏర్పాటు చేసినట్లు గౌడన్నలు తెలిపారు.

బండరాళ్లు పెట్టి బలిచేయొద్దు

- బాల్కొండ మండలంలో జొన్న పంటను రోడ్లపై ఆరబెడుతున్న రైతులు
- రక్షణగా పక్కన రాళ్లు పెడుతున్న వైనం
- ప్రమాదం పొంచి ఉందంటున్న వాహనదారులు



నాగంపేట్ శివారులో తారు రోడ్డుపై ఆరబెట్టిన జొన్నల పక్కన బండరాళ్లు

బాల్కొండ: రైతులు తమ పంట దిగుబడులను తారు రోడ్లపై ఆరబెడుతూ, రక్షణగా బండరాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్లపై రాళ్లతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ప్రస్తుతం జొన్న కోతలు జోరందుకోవడంతో రైతులు నూర్పిళ్లు చేసిన పంట దిగుబడులను తారు రోడ్లపై ఆరబెడుతున్నారు. అలా ఆరబెట్టిన జొన్నల పక్కన బండరాళ్లను, కర్రలను పెడుతున్నారు. దీంతో రోడ్డుపై ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది ముప్కాల్ మండలం రెంజర్ల శివారులో ఎర్ర జొన్నల పంటలకు అడ్డుగా పెట్టిన రాళ్ల కారణంగా ప్రమాదం సంభవించి అదే గ్రామానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు. అంతేకాకుండ వేర్వేరు ఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అయినా పాలకులు, అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలేదు.

ఇదీ పరిస్థితి..

రోడ్లపై పంటల పక్కన ఏర్పాటు చేసిన రాళ్లను రాత్రివేళల్లో వాహనదారులు గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొంతమది రైతులు పంట దిగుబడులను తరలించిన కూడా రోడ్లపై బండరాళ్లను అలానే వదిలి వెళ్తున్నారు. అన్నదాతలు తారు రోడ్లపై పంట దిగుబడులను ఆరబెట్టినా, వారి పాట్లను గమనించి ప్రజలు ఎలాంటి ఫిర్యాదులు చేయడం లేదు. కాని బండరాళ్లను పెట్టడం వల్ల ప్రాణాలు పోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తారు రోడ్లపై ఇప్పటి నుంచి మే వరకు ఏదో ఒక పంట దిగుబడి వస్తూనే ఉంటుంది. జొన్నలు పూర్తయ్యేలోపు వరి పంటలు చేతికి వస్తాయి. దీంతో వరి ధాన్యం రోడ్లపై ఆరబెడుతారు. తర్వాత సజ్జ పంటలు చేతికి రాగానే వాటిని ఆరబెడుతారు. ఇలా ఏడాదిలో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లోనే రోడ్లు ఖాళీగా ఉంటాయి. సెప్టెంబర్‌లో మక్కలు, నవంబర్, డిసెంబర్‌లో వానాకాలం వరి పంటలు, జనవరి, ఫిబ్రవరి, మార్చిలో జొన్న పంటలు ఇలా ఎప్పుడు రోడ్లు పంట దిగుబడులతోనే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతులకు ఇతర ప్రాంతాల్లో సిమెంట్ కళ్లాలను నిర్మించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం..

రోడ్లపై పంట దిగుబడులను ఆరబెడుతూ పక్కన రాళ్లు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తాం. రాళ్ల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులు ప్రయాణికుల ఇబ్బందులను కూడా అర్థం చేసుకోవాలి.

– రజనీకాంత్, ఎస్సై, ముప్కాల్



సింగితం జెడ్పీహెచ్ఎస్ 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులందరూ ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆప్యాయంగా మాట్లాడి, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని, చదువులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కలకొండ. నారాయణ, లతీఫ్, దమ్ము వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, పాపారావు,శంకర్, రమేష్ కృష్ణప్రసాద్, పూర్వ విద్యార్థులు రవీ, సందీప్‌గౌడ్, వీరేశం, మహందర్‌గౌడ్, రఫీ, దుర్గయ్య, శివకుమార్, కిరణ్, శ్రీకాంత్, చిరంజీవి, నగేష్, అఖిలేష్‌గౌడ్, దత్తయ్య, స్వరూప, శ్రీలత ఉన్నారు.

25 ఏళ్ల తర్వాత..

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామంలోగల మున్నూరుకాపు సంఘంలో ఆదివారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు. ఆనాటి హెచ్ఎం వెంకట్ గౌడ్, ఉపాధ్యాయులు దత్తాద్రి, శంకరయ్య మాట్లాడుతూ.. అప్పటి చదువుకు, ఇప్పటి చదువుకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రెడ్డిపేట పాఠశాల చరిత్రలో మొట్టమొదటి ఆత్మీయ సమ్మేళనం అని ఆనందం వ్యక్తం చేశారు.



రెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్ 1998-99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ఆర్మూర్‌లో ప్రజాపాలన సేవ కేంద్రం ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ కార్యాలయంలో ప్ర జా పాలన సేవ కేంద్రం ఏర్పాటు చేశామని కమిషనర్ రాజు తెలిపారు. ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన కులగణన సర్వే పాల్గొనని 73 మందిని పట్టణంలో గుర్తించామన్నారు. ఈ నెల 16 తేదీ నుంచి 28 వరకు సర్వేలో పాల్గొనని వారు వివరాలను అందజేయాలని సూచించారు. సెలవు రోజులలో సైతం ప్రజాపాలన సేవ కేంద్రం ఉంటుందన్నారు.

వలకు చిక్కిన భారీ చేప



వేల్పూర్‌లో మత్స్యకారుడు కిషన్‌కు లభించిన భారీ చేప

వేల్పూర్: మండల కేంద్రంలో బండి కిషన్ అనే మత్స్యకారునికి ఆదివారం 15 కిలోల భారీ బొచ్చ చేప లభ్యమైంది. ఎప్పటిమాదిరిగానే తాను స్థానిక చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లగా భారీ చేప లభించినట్లు చెప్పాడు. భారీ చేప లభించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశాడు.

వృక్షార్చనను విజయవంతం చేయండి



వృక్షార్చన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తాడ్వాయి పల్లె ప్రకృతివనంలో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

బాన్సువాడ రూరల్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం నిర్వహించే వృక్షార్చన కార్యక్రమంలో ప్రజలు, పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు షేక్ జుబేర్ కోరారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా కేసీఆర్ పుట్టిన రోజున ప్రతి ఒక్కరు 3 మొక్కలు నాటి సెల్ఫీని 9177916838 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా ముందస్తుగా ఆదివారం బాన్సువాడలో ఆపార్టీ నేతలు షేక్ జుబేర్.. చర్చిలో కేక్ కట్ చేశారు. క్రైస్తవులతో కలిసి చర్చి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను కామారెడ్డిలో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ఆయన నివాసం వద్ద ఈ వేడుకలు ఉంటాయన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి/ఎల్లారెడ్డిరూరల్: కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా తాడ్వాయి పల్లెప్రకృతి వనంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆలోచన వల్లనే తాడ్వాయి గుట్టపైన పల్లెప్రకృతి వనం ఒక అడవిలా రూపు దిద్దుకుందన్నారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ నర్సిములు, తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించే కేసీఆర్ జన్మదిన వేడుకలలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తెలిపారు.

కుళ్లిపోయిన మటన్ అమ్ముతున్నారని ఫిర్యాదు



తనిఖీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మటన్ షాపుల్లో కుళ్లిపోయిన మేక మాంసం అమ్ముతున్నారని ఆదివారం పంచాయతీ, వెటర్నరీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది మటన్ విక్రయించే షాపులకు వెళ్లి తనిఖీ చేశారు. రెండు రోజు క్రితం కోసిన మేక మాంసం ఫ్రిజ్‌లో పెట్టి అమ్ముతున్నారని, వాసన వస్తుందని అధికారులు తెలిపారు. ఇలాంటి మాంసం అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం కోసం కోస్తున్న మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా వెటర్నరీ అధికారులు పరిశీలించకుండానే కోస్తున్నారు. అలాగే చాలా మంది చికెన్, మటన్ షాపుల లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని మాంసంప్రియులు కోరుతున్నారు.

స్థలం విషయంలో వివాదం



తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చిన దేమికలాన్ గ్రామస్తులు

- పెనుగులాటలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి
- న్యాయం చేయాలని కోరుతున్న దేమికలాన్ గ్రామస్తులు

తాడ్వాయి (ఎల్లారెడ్డి): దేమికలాన్‌లో రెండు ఇళ్ల మధ్య స్థలం విషయంలో వివాదం చెలరేగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గుండెపోటుతో మరణించాడు. వివరాలు.. దేమికలాన్ గ్రామానికి చెందిన పురం లక్ష్మీపతి(42), మంగళి రాజయ్యలకు మధ్య స్థలంలో విషయంలో ఆదివారం మాటామాట పెరిగి గొడవ పెద్దగా తయారైంది. దీంతో రాజయ్య కోపంతో కర్రతో లక్ష్మీపతిని కొట్టడానికి ప్రయత్నించాడు. దీంతో లక్ష్మీపతికి అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చి కిందపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మీపతిని కామారెడ్డిలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మీపతి మృతికి కారకుడైన రాజయ్యపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయంచేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తాడ్వాయి పోలీసుస్టేషన్‌కు తరలి వచ్చారు. లీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్‌రౌండర్ ఈ హిందీ టీచర్



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో మార్చ్‌పాస్ట్ సాధన చేస్తున్న విద్యార్థులు

- అందరి మన్ననలు పొందుతున్న ఉపాధ్యాయుడు బల్వంత్‌రావు
- విద్యార్థులకు హిందీ బోధనతో పాటు ఎన్‌సీసీ ద్వారా మార్చ్‌పాస్ట్ శిక్షణ
- హిందీ వ్యాకరణం అర్థమయ్యేలా సరళంగా పుస్తక రచన

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు హిందీ బోధనతో పాటు ఎన్‌సీసీ ద్వారా మార్చ్ పాస్ట్ నేర్పుతున్నారు హిందీ ఉపాధ్యాయులు బల్వంత్‌రావు. అలాగే సరళంగా అర్థమయ్యే రీతిలో హిందీ వ్యాకరణ పుస్తకాన్ని రచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా కంతాలే బల్వంత్‌రావు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని సుక్కల్ తీర్థం గ్రామానికి చెందిన బల్వంత్‌రావు విద్యాభ్యాసం పూర్తయిన తరువాత కొన్ని సంవత్సరాలు ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. అనంతరం 2011లో సంగారెడ్డి జిల్లాలోని పెద్ద శంకరంపేట మోడల్‌స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. హిందీ బోధన చేయడంతో పాటు విద్యార్థులకు తన వంతుగా ఏదైనా నేర్పించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీ శిక్షణ పొంది బల్వంత్‌రావు విద్యార్థులకు సైతం మార్చ్‌పాస్ట్ నేర్పించారు. ఆయన సేవలను గుర్తించిన అధికారులు 2016లో మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2019లో సంగారెడ్డి జిల్లా ఉత్తమ హిందీ ఉపాధ్యాయుడిగా అవార్డులను అందుకున్నారు. ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకలలో విద్యార్థులతో మార్చ్‌పాస్ట్ చేయించి అందరి మన్ననలు పొందారు. తనలో ఉన్న కళను విద్యార్థులకు నేర్పించి సంతృప్తి చెందుతున్నారు బల్వంత్‌రావు.

గుర్తింపు ఉండాలన్నదే నా తపన



పాఠశాలలో ప్రత్యేక గుర్తింపు ఉండాలనే లక్ష్యంతో విద్యార్థులకు చదువుతో పాటు మార్చ్‌పాస్ట్ నేర్పుతున్నాను. తాను ఎన్‌సీసీలో పొందిన శిక్షణను విద్యార్థులకు అందిస్తున్నాను. విద్యార్థులు వ్యాకరణంలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సరళ వ్యాకరణ పుస్తకాన్ని రచించి విద్యార్థులకు అందించి 14 సంవత్సరాలుగా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించేలా కృషి చేస్తున్నాను.

– బల్వంత్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు, మోడల్‌స్కూల్, ఎల్లారెడ్డి

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



చంద్రమోహన్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలకేంద్రానికి చెందిన బెజ్జవార్ చంద్రమోహన్(34) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. వివరాలు ఇలా.. జుక్కల్‌కు చెందిన చంద్రమోహన్‌కు అప్పులు ఎక్కువవడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం తాను అప్పులు తీర్చేది ఎట్లా అంటూ ఇంటి వద్ద రోధించి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఆదివారం తెల్లవారుజామున ఉప్పలంచవార్ లక్ష్మణ్ ఇంటి వద్ద ఉన్న పాడుబడ్డ బావిలో చంద్రమోహన్ శవమై కన్పించాడని ఎస్సై తెలిపారు. అప్పుల బాధతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈమేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన వర్షపల్లి మల్లేష్(64) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. మల్లేష్ గత కొన్ని సంవత్సరాల నుంచి బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం బాత్రూంలో ఉన్న ఫినాయిల్ తాగి, ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని గమనించి, ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బోధన్‌రూరల్: సాలూర మండలకేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.11,600లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి గ్రామం నుంచి అక్రమంగా బోధన్‌కు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మాజీ ప్రజాప్రతినిధిపై ఫిర్యాదు

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గౌస్‌పై అతడి వదిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈసందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ.. తాను గ్రామంలో లేనిసమయంలో సదరు మాజీ ప్రజాప్రతినిధి తన ఏటీఎం తీసుకుని రెండు పెట్రోల్ బంకుల్లో స్వైప్ చేసి రూ. లక్షా9వేలు తీసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. విచారణ జరిపి న్యాయం చేయాలని మహిళ విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్నూర్‌లో పెంటకుప్ప దగ్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు పెంటకుప్ప దగ్ధమయినట్లు బాధితుడు హుల్లాజీ తెలిపారు. తన ఇంటికి సమీపంలో గల పెంటకుప్పకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయని ఆయన తెలిపారు. ఈ విషయమై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.పదివేల నష్టం జరిగిందని వారు తెలిపారు.

జానకంపేట రైల్వేస్టేషన్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: జానకంపేట రైల్వేస్టేషన్‌లో ఓ మహిళ మెడలోనుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన కుమారిరెడ్డి రేణుక(23) తన స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం బాసరకు వెళ్లింది. తిరిగి సాయంత్రం రైలులో ఆమె హైదరాబాద్ వెళుతుండగా జానకంపేట రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్ ఉండటంతో ఆగింది. కొద్దిసేపటికి రైలు బయలుదేరగా ప్లాట్‌ఫామ్‌పైన గుర్తు తెలియని ఒక వ్యక్తి తన వద్దకు వచ్చి కిటికీ లోంచి తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్ ఎత్తుకెళ్లాడు. వెంటనే ఆమె నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మైలారం గ్రామంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన లక్ష్మి తన బంధువుల శుభకార్యం నిమిత్తం ఆదివారం కొచ్చెరి మైసమ్మ ఆలయానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఆమె ఆలయం నుంచి వెళ్తుండగా వెనుకనుంచి బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించగా, విషయం తెలుసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ నస్రుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితురాలితో మాట్లాడారు. వెంటనే దర్యాప్తు చేయాలని ఎస్సై లావణ్యను ఆదేశించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రేఖవార్ రాజు తన భార్య స్వరూపారాణితో కలిసి ఈ నెల 9న ఇంటికి తాళం వేసి మహా కుంభమేళ కోసం ప్రయాగ్ రాజ్‌కు వెళ్లారు. ఈనెల 15న పక్కింటి వారు వాళ్లకి ఫోన్ చేసి, మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయంటూ సమాచారం అందించారు. వారు ఆదివారం ఇంటికి వచ్చి చూడగా, చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు వివరాలు సేకరించారు. తాళం పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోని సుమారు 3తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు.